
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.4 । కనిష్ఠం 24.1



రెండు పాఠశాల బస్సుల సీజ్

కామారెడ్డి టౌన్, జూన్ 12: నిబంధనలకు విరుద్ధంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా, ట్యాక్స్‌లు చెల్లించకుండా రోడ్డుపై తిప్పుతున్న రెండు పాఠశాలల బస్సులను సీజ్ చేసినట్లు ఆర్‌టీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా ఎవరైన బస్సులను రోడ్డుపైకి తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



పాఠశాల బస్సును సీజ్ చేస్తున్న అధికారులు

కామారెడ్డిలో.. ఆధిపత్య పోరు!



వాగ్వాదం చేసుకుంటున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్



వివాదానికి కారణమైన హోటల్

- కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ
- బల్దియాలో పట్టు సాధించేందుకు ఇరుపార్టీల ముఖ్యనేతల ప్రయత్నాలు
- మున్సిపల్, ఇతర శాఖాధికారులతో ఎవరికివారే సమావేశాలు
- బల్దియాలో కూల్చివేతలపై రాజకీయం
- అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఓ హోటల్ కూల్చివేతలో అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే

కామారెడ్డి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. కామారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బీజేపీ నుంచి కాటిపల్లి వెంకట రమణారెడ్డి గెలుపొందారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కామారెడ్డి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న షబ్బీర్‌అలీకి కాంగ్రెస్ ప్రభుత్వం క్యాబినెట్ హోదాతో ప్రభుత్వ సలహాదారుడిగా నియమించింది. అయితే కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య ఆధిపత్య పోరు నెలకొంటుంది. ఇటు నియోజకవర్గంతో పాటు అటు కామారెడ్డి బల్దియాపై అధిపత్యం, పట్టు సాధించేందుకు ఇరుపార్టీలకు చెందిన నేతలు ప్రయత్నాలు చేస్తుండడంతో నియోజకవర్గంలో రాజకీయం మరింత రంజుగా మారుతోంది. అయితే నియోజకవర్గం స్థాయి అధికారులతో పాటు మున్సిపల్ అధికారులతో ఇరుపార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు వేర్వేరుగా సమావేశాలు పెట్టడం వారివారి స్థాయిలో అధికారులకు ఆదేశాలు ఇవ్వడం బట్టిచూస్తుంటే స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ మధ్య ఆధిపత్య పోరు నెలకొంటుందనే చర్చ సాగుతోంది. కామారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పలు అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారుడు ఎవరికి వారే కార్యక్రమాలు చేయడాన్ని బట్టి చూస్తుంటే వీరి మధ్య విభేదాలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.

తలలు పట్టుకుంటున్న అధికారులు

కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య ఆధిపత్యం కొనసాగుతుండడంతో నియోజకవర్గ పరిధిలోని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అభివృద్ధి పనులతో పాటు పలు అధికారిక కార్యక్రమాల విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటాపోటీ నెలకొంటుండడంతో ఎవరిని పిలిచినా, ఎవరిని పిలవకున్నా ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికార వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగియ గానే కామారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో అదనపు పడకల ఏర్పాటు విషయంలో వైద్యశాఖ అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి శాఖాధికారులను నిలదీసిన విషయం తెలిసిందే. షబ్బీర్ అలీ ఏ హోదాలో ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారని నిలదీశారు. అయినప్పటికీ షబ్బీర్‌అలీ ప్రభుత్వ సలహాదారుడి హోదాలో ఆసుపత్రి లో అదనపు పడకల గదులను ప్రారంభించారు. అయితే గత రెండు నెలల క్రితం మున్సిపల్‌లోని పలు విభాగాల అధికారులు, ఉద్యోగులతో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాల యంలో సమీక్ష నిర్వహించారు. దీనికి పోటీగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ రెండ్రోజుల క్రితం కలెక్టరేట్‌లో కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి పనులు, నీటి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఇలా ఇరుపార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పోటాపోటీగా సమీక్షలు నిర్వహిస్తుండడంతో జిల్లాస్థాయి అధికారుల్లోనే కాకుండా నియోజకవర్గస్థాయి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎవరు ఏ వైపు నుంచి తమపై పడుతారోనని ఆందోళన చెందుతున్నారు.

బల్దియాలో కూల్చివేతలపై రాజకీయం

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల తర్వాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మున్సిపల్‌లో అక్రమ కట్టడాలపై, అప్పులపై, కోల్పోతున్న ఆదాయంపై, నష్ట నివారణపై కౌన్సిలర్‌లు, అధికారులకు ఏ విధంగా చేయాలనే దానిపై చర్చించారు. ఆ తర్వాత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అక్రమ కట్టడాలు, రోడ్డు ఆక్రమణలపై, నిర్మాణాలు చేపట్టి పన్ను ఎగ్గొడుతున్న, కమర్షియల్ బిల్డింగ్‌లకు డొమెస్టిక్ పన్నులు వసూలు చేస్తున్న దానిపై తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. దీంతో అధికారులు నోటీసులు అందించారు. ఆ సమయంలోనే ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సైతం చైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్‌లో అవినీతిలేని పాలన అందించేందుకు కృషి చేస్తామని అధికారులు సైతం అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో అధికారులు ఆ దిశగా పనులు చేస్తున్నారు. బుధవారం ఓ హోటల్‌ను అకస్మాత్తుగా కూల్చి వేయడంపై నిబంధనలు పాటించలేదంటూ ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం ఎవరి ఆదేశాల ప్రకారం ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నించడంతో పాటు ఆ సమయంలో అటువైపుగా వచ్చిన ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్‌లను నిలదీశారు. దీంతో కౌన్సిలర్‌లు సైతం నిరాధారమైన ఆరోపణలు చేయవద్దని ఎమ్మెల్యే చెప్పినట్లుగానే అధికారులు చేస్తున్నారని అక్రమ కూల్చివేతలను ఎమ్మెల్యే కూల్చివేయడం ఏంటని ప్రశ్నించడం, ఒక్క ఆ హోటల్‌నే ఎందుకు కూల్చివేశారని మిగిలిన వాటికి నిబంధనలు ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించడంతో కూల్చివేతలపై రాజకీయం రంజు గా మారింది.

ఓ హోటల్ కూల్చివేతతో అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే

నిబంధనలు పాటించకుండా కూల్చివేతలు ఎలా చేపడుతారంటూ కామారెడ్డి మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కామారెడ్డిలోని వసుధ హోటల్‌లో కూల్చివేతలు చేపట్టడంపై మున్సిపల్ కార్యాలయం వద్ద అధికారులను నిలదీశారు. కూల్చివేతలకు ఓ కమిటీ అనేది ఉంటుందనే విషయాన్ని మర్చిపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఒకవేళ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ చెబితే కూల్చివేతలు చేశారా అంటూ అక్కడికక్కడే షబ్బీర్‌అలీతో ఫోన్ ద్వారా మాట్లాడారు. షబ్బీర్ అలీ సైతం తాను ఎవరికి ఏ కూల్చివేతలు చేయాలని చెప్పలేదని అధికారులు తమ నిబంధనల ప్రకారం పని చేయాల్సి ఉంటుందని ఫోన్ ద్వారా తెలిపారు. పోని కలెక్టర్‌కు ఈ విషయం తెలియజేశారా అని ప్రశ్నించడంతో అధికారులు ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో అయితే ఏ నాయకులు చెప్పినట్లు పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం, ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్న ఎక్కడ లోపాలు ఉన్నాయనే దానిపై తాను సమగ్రంగా వివరాలు సేకరించి ఓ పద్ధతి ప్రకారం పని చేయాలన్నారు. అక్రమ కట్టడాలకు, ఇంటి నెంబర్ లేకుండా ఉన్న వారికి, కమర్షియల్ బిల్డింగ్‌లో డొమెస్టిక్ పన్ను చెల్లిస్తున్న వారిని గుర్తించాలని, రోడ్డు ఆక్రమణలు చేపట్టిన వారిని గుర్తించి నోటీసులు అందించాలని తానే అధికారులకు చెప్పానని అన్నారు. ఇటీవల మున్సిపల్‌లోని అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధిపై చర్చ జరిపానని వారికి కొంత సమయం ఇవ్వాలని ఆలోచన చేసి అందరిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని చూస్తుంటే తానే కట్టడాలను కూల్చివేయాలని ఆదేశించినట్లు అధికారులు పని చేయడం సిగ్గుచేటని అన్నారు. కొందరు నాయకులు చెప్పినట్లు మున్సిపల్ అధికారులు పని చేస్తున్నారని ఆ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు చెబుతున్న అధికారులు ఒక్క వసుధ హోటల్‌నే ఎందుకు కూలకొట్టాల్సి వచ్చిందని ఎన్నో ఏళ్లుగా ఉన్న నాయకుల, ఇతరుల అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. హోటల్‌ను ఒక ప్రణాళిక ప్రకారం కూల్చివేసి ఈ కూల్చివేతతో వసూళ్లకు పాల్పడాలనుకుంటున్న నాయకులకు ఆదాయ వనరుగా మారేందుకు అధికారులు సహకరించడం సిగ్గుచేటని అన్నారు. కూల్చివేతలు మొదలుపెడితే వందల అక్రమ నిర్మాణాలు ఉన్నాయని వాటిని సైతం కూల్చివేయాలని అన్నారు. అధికారులతో మాట్లాడుతున్న సమయంలోనే మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కౌన్సిలర్ పాత శివకృష్ణమూర్తి మున్సిపల్ కార్యాలయానికి రావడంతో ఎమ్మెల్యే చైర్‌పర్సన్‌ను కూల్చివేతలపై ఆరా తీసే ప్రయత్నం చేశాడు. ఇదేక్రమంలో కౌన్సిలర్ చాంబర్‌లోకి వెళ్లి మాట్లాడదామని చెప్పడంతో ఎమ్మెల్యే, కౌన్సిలర్ మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ తర్వాత కౌన్సిలర్ చాట్ల వంశీ తనపై నిరాధారణమైన ఆరోపణలు చేయడం తగదంటూ ఎమ్మెల్యేతో వాగ్వాదం చేయడంతో మరో 15 రోజుల్లో ఎవరేమి చేస్తున్నారో అన్ని ఆధారాలు ప్రజలకు తెలిసేలా చూపుతానని అన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు పంపరి శ్రీనివాస్, కౌన్సిలర్ శివకృష్ణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే అక్రమ కూల్చివేతలపై నోటీసులు అందించాలని చెప్పి ఇప్పుడు ఈ విధంగా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. పట్టణానికి ఎంట్రెన్స్‌లో ఉంది కాబట్టి వసుధ హోటల్ నుంచి కూల్చివేతలు ప్రారంభించామని తెలిపారు.

నేను కూడా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే చదివా..!

కలెక్టర్ జితేశ్ వి. పాటిల్



విద్యార్థినికి దుస్తులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

నిజాంసాగర్, జూన్ 12: నా విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే చదివి జిల్లా కలెక్టర్ అయ్యానని కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ తెలిపారు. బుధవారం నిజాంసాగర్ మండల కేంద్రంలో బడిబాటలో భాగంగా బడి పిల్లలకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లను కలెక్టర్‌తో పాటు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యాయని విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసిననాడే మంచి పునాది ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలపై మక్కువ చూపకుండా ప్రభుత్వ పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో లక్షల రూపాయలలో ఫీజులుంటాయని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా విద్యాభ్యాసం చేయిస్తారన్నారు. పాఠశాలల్లో విద్యాభ్యాసం చేయించే ఉపాధ్యాయులు మంచి క్రమ శిక్షణ, విద్య అందిస్తే విద్యార్థులు సక్సెస్ అవుతారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలున్నా, లేకున్నా విద్యార్థులు చదువుపై ఎంతో మక్కువ చూపాలని, అంచలంచెలుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటైందని, ఈ కళాశాల రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో నడిపేందుకు అధికారులను ఆదేశించామన్నారు. మాగి గ్రామ పాఠశాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలుగా పరిగణిస్తున్నామని, అన్ని మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించి వసతులు కల్పిస్తామన్నారు. పాఠశాలలో మిషన్ భగీరథ నీళ్లు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, తహసీల్దార్ భిక్షపతి, ఎంఈవో దేవీసింగ్, నిజాంసాగర్, మహ్మద్ నగర్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి టౌన్‌షిప్‌లో మౌలిక వసతులు కల్పించాలి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అడ్లూర్ గ్రామ శివారులోని ధరణి టౌన్‌షిప్‌లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో బీటీ రోడ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మురుగు కాలువల నిర్మాణం వంటి మౌలిక వసతుల ఏర్పాటుకు అధికారులు అంచనాలు రూపొందించాలని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నీరు లేక పోచారం వెలవెల

నాగిరెడ్డిపేట, జూన్ 12: నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలకు వరప్రదాయని అయిన పోచారం ప్రాజెక్టు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతోంది. ప్రాజెక్టు కట్ట వద్ద ప్రాజెక్టులో నీరు పూర్తిగా అడుగంటి పోగా, ప్రాజెక్టు ప్రధాన కాలువ గేట్ల వద్ద ప్రాజెక్టులో నీరు లేక మైదానాన్ని తలపిస్తోంది. గత రెండు నెలల క్రితం డెడ్ స్టోరేజ్‌కు చేరిన పోచారం ప్రాజెక్టు ఏప్రిల్, మే నెలలో దంచి కొట్టిన ఎండలకు ప్రాజెక్టులో ఉన్న కొద్దిపాటి నిలువ నీరు మరింతగా ఇంకిపోయింది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1464 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 0.094 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. 2023-24 సంవత్సరానికి గాను ఖరీఫ్, రబీ రెండు పంటల సాగుకు ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు భూములకు నీటి పారుదల శాఖ అధికారులు సాగు నీటిని అందించారు. గత వర్షాకాలంలో అధిక వర్షాలు కురవడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. వర్షాకాలం (ఖరీఫ్) సీజన్ నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి రెండు మండలాలకు చెందిన అధికారిక లెక్కల ప్రకారం ప్రాజెక్టు పరిధిలో 10,500 ఎకరాలకు సాగు భూములుండగా, అనధికార లెక్కల ప్రకారం సుమారు 17వేలకుపైగా ఎకరాల సాగు భూములుండగా మొత్తం ఆయకట్టు భూములకు ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించారు. అలాగే రబీ సీజన్‌లోనూ ప్రాజెక్టు పరిధిలోని బీ జోన్‌కు చెందిన ఎల్లారెడ్డి మండలంలోని సాగు భూములకు ప్రాజెక్టు ద్వారా నీరు అందించారు. బీ జోన్‌కు చెందిన యాసంగి పంటలన్నీ బ్రహ్మాండంగా పండాయి. ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్, రబీ రెండు పంటలకు సాగునీరు అందించడంతో ప్రాజెక్టులోని నీరు పూర్తిగా అడుగంటి పోయాయి. ప్రాజెక్టులో కొద్దిపాటి నీరు ఉండగా నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో ఉగాది పర్వదినం సందర్భంగా జరిగిన నల్ల పోచమ్మ జాతర ఉత్సవాల కోసం భక్తులకు స్నానాల సౌకర్యం కోసం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని వదిలి భక్తులకు నీటి సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తిగా అడుగంటి పోయింది.



పోచారం ప్రాజెక్టు కట్ట వద్ద పూర్తిగా అడుగంటిన నీరు

ప్రాజెక్టులో నీరు లేక నారుమళ్లు వేసుకోని రైతులు

పోచారం ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో ఖరీఫ్ పంట సాగు కోసం ఆయకట్టు రైతులు వరి నారుమళ్లను వేసుకోలేదు. పంటల సాగు కోసం దుక్కి దున్ని భూముల్ని సిద్ధం చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున తొలకరి వర్షాలు కురిస్తే ప్రాజెక్టులోకి కొద్దిపాటి నీరు వస్తే ఆయకట్టు రైతులు వరి నారుమళ్లు వేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన రైతులు బోరు బావుల సహాయంతో వరిని సాగు చేస్తున్నారు.

గంభీరావ్‌పేటలో భిక్కనూరు వాసుల మృతి

మల్లుపల్లిలో విషాదం

భిక్కనూరు, జూన్ 12: ఇక్కడ ఎంత బండకొట్టినా కుటుంబ పోషణ కష్టమవుతుందని భావించి ఎలాగైనా అరబ్ దేశానికి బతుకుదెరువు నిమిత్తం వెళ్లి సంపాదించుకుందామని అనుకున్న వారి ఆశలు అడియాశలై డీసీఎం రూపంలో మృత్యువు వెంటాడి భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన ఇద్దరు మృతి చెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావ్‌పేట వద్ద బుధవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నిజాంపేటకు చెందిన తుర్కకాశీ చందా(40) గత 22 సంవత్సరాల క్రితం మల్లుపల్లి వచ్చి ఇక్కడే స్థిరపడగా మరొకరు అదే గ్రామానికి చెందిన అబ్దుల్లా(32) ఇరువురు వారి కులవృత్తి అయిన రాళ్లు కొట్టి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ ఎంత పని చేసినా కుటుంబ పోషణకు డబ్బులు సరిపోవడం లేదని అరబ్ దేశానికి వెళ్దామని నిర్ణయించుకున్నారు. అక్కడికి వెళ్లేందుకు కరీంనగర్‌కు చెందిన ఒకరిని సంప్రదించి అతడి ద్వారా అన్ని పనులను పూర్తిచేసుకోగా ఇంటర్వ్యూ మిగిలింది. సిరిసిల్లలో జరిగే ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు బైక్‌పై ఇరువురు ఉదయాన్నే గ్రామం నుంచి బయలుదేరి వెళ్తుండగా గంభీరావ్‌పేట వద్ద డీసీఎం ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అబ్దుల్లాకు భార్య జయరాంబీ, కుమారుడు, కూతురు, తల్లిదండ్రులు మౌలానా-శిలార్ బీ ఉన్నారు. చందాకు భార్య ఫాతిమా, కుమారుడు, కూతురు ఉన్నారు. రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న కటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో వాహనాల్లో ప్రమాద స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఇరువురి మృతితో మల్లుపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



అబ్దుల్లా (ఫైల్)



సయ్యద్ చాంద్ (ఫైల్)

జంగంపల్లిలో విషాదఛాయలు

తాడ్వాయి మండల కేంద్రం సమీపంలో రోడ్డు ప్రమాదంలో భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి రాజు(28) మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. తాడ్వాయిలో డప్పుకొట్టేందుకు వెళ్లి తిరిగి జంగంపల్లికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడని సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. కాగా మూడు సంవత్సరాలలోపు రాజు తల్లిండ్రులు, కూతురు ఇలా నలుగురు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య స్వప్న, సోదరుడు ప్రశాంత్ ఉన్నారు.

మోగిన బడి గంట

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- తొలిరోజు అంతంత మాత్రంగా విద్యార్థుల హాజరు
- కొన్నిచోట్ల తరగతిని శుభ్రం చేసుకున్న విద్యార్థులు
- పాఠశాలలు తెరిచినా సమస్యలు యధాతథం

కామారెడ్డి టౌన్, జూన్ 12: వేసవి సెలవులతో నిన్న, మొన్నటి వరకు ఆట పాటలతో ఉల్లాసంగా గడిపిన విద్యార్థులు బుధవారం బడి గంట మోగడంతో పాఠశాలలకు పరుగులు పెట్టారు. తొలిరోజు ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సందడి కనిపించలేదు. మొదటి రోజు అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు తెరుచుకోగా పాత సమస్యలే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో స్వాగతం పలికాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పలుచగా కనిపించగా కొన్ని పాఠశాలలు రెండంకెలు మించి విద్యార్థులు రాకపోవడం గమనార్హం. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల కంటే ఉపాధ్యాయులే ఎక్కువగా హాజరవ్వడంతో బంద్ వాతావరణం కనబడింది. అయితే సెలవుల్లో మైదానంలో, చెట్ల నీడన ఆటలాడుతూ సేదతీరిన పిల్లలు మొదటి రోజు పాఠశాలలకు కాస్త భారంగానే వచ్చారు. కొందరి పిల్లలు పాఠశాలలకు వెళ్లమంటు మారం చేస్తూ రోదించిన దృశ్యాలు అక్కడక్కడ చోటు చేసుకున్నాయి. ఏది ఏమైనా చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు అలాగే ఉండడంతో గత సంవత్సరం మాదిరే ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

తొలిరోజు విద్యార్థుల హాజరు అంతంతే!

వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజు విద్యార్థులు అత్యల్పంగానే హాజరయ్యారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకంటే ఉపాధ్యాయులు ఎక్కువగా హాజరయ్యారు. పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను మరో నాలుగైదు రోజుల తర్వాత పాఠశాలలకు పంపే ఆలోచన చేయడంతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో సైతం విద్యార్థులు హాజరు అంతగా లేకపోవడంతో మధ్యాహ్నం వరకే పాఠశాలలు కొనసాగించి ఆ తర్వాత మూసి వేశారు. మొదటిరోజు వేసవిలో వారు వెళ్లిన టూర్‌లు, ఆడుకున్న ఆటలు, శుభకార్యాలు తదితర అంశాలను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో పంచుకోవడంలోనే మొదటి రోజు గడిచిపోయింది.

సమస్యలు యధాతథం

ప్రభుత్వ పాఠశాలల్లో ఎప్పటిలాగే సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలికాయి. ప్రస్తుతం కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద పనులు కొనసాగుతుండడంతో వాటికి సంబంధించిన మెటీరియల్, పాఠశాలలో గతంలో కూల్చివేసిన వాటి భవన నిర్మాణ వ్యర్థాలు పాఠశాల తరగతి గదిలోకి వెళ్లలేకుండా, పాఠశాల పరిసరాలలో పేరుకపోయాయి. స్కావెంజర్‌లు లేకపోవడంతో మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బందితో పాఠశాలలను శుభ్రం చేయించిన పైపైనే పారిశుధ్య పనులు జరిగాయి. ఇక పరిసరాలల్లోని పిచ్చి మొక్కలు చెత్తా చెదారం అలానే ఉండిపోవడంతో పాటు ఆకతాయిలు ఆయా పాఠశాలల ప్రాంగణంలో మద్యం తాగుతూ పగులకొట్టిన గాజు పెంకులు విద్యార్థులకు ఇబ్బందులను కల్గించాయి.



పాఠశాలకు హాజరైన విద్యార్థులు

ఈనెల 14న పీడీఎస్ బియ్యం వేలం

వేల్పూర్, జూన్ 12: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 14న పీడీఎస్ బియ్యానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరిత తెలిపారు. వేలంలో పాల్గొనబోయే వారు నిబంధనల ప్రకారం దారవత్ రూ.20వేల బ్యాంక్ డీడీ ద్వారా చెల్లించాలని సూచించారు. 1720.83 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్లూర్ గ్రామంలోని శ్రీకృష్ణ అగ్రో ఇండస్ట్రీస్‌లో, 763.10 క్వింటాళ్ల బియ్యాన్ని పచ్చలనడ్కుడలోని ఏబీఎల్ అగ్రో ఇండస్ట్రీస్‌లో, 587 క్వింటాళ్ల బియ్యాన్ని మోతె గ్రామంలోని సూర్య ఆగ్రో ఇండస్ట్రీస్‌లో భద్రపర్చడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు.

వాహనాల తనిఖీ

ఎడపల్లి, జూన్ 12: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్ ధరించకుండా నడిపిన వాహనాలను, మైనర్లు నడిపిన వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ నరేష్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఎస్సై వంశీకృష్ణా రెడ్డిలతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రిద్దాం'

పెద్దబజార్, జూన్ 12: దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు. బుధవారం నగరంలోని డీఎం హెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, యూనిట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హ్యాబిటేషన్ పరిధిలో హౌస్ హోల్డ్ పరిధిలో దోమల నియంత్రణ జరగడానికి ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఉపకేంద్ర స్థాయిలో, గ్రామ పంచాయతీ స్థాయిలో, బీఎస్సీ స్థాయిలో, వివిధ శాఖల సహకారంతో గ్రామసభలు, ఉపకేంద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో వివిధ సమావేశాల్లో దోమల ద్వారా వ్యా పిం చే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు లాంటి వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ప్రజలందరిని దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకునేలా వివరించాలన్నారు.

బాన్సువాడలో వృద్ధురాలి దారుణ హత్య

బాన్సువాడ, జూన్ 12 : బాన్సువాడలో వృద్ధురాలు దారుణ హత్య కలకలం రేపింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వృద్ధురాలిని గొంతు కోసి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. దుండగులు బాన్సువాడ మండలం తాడ్కూరు గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నివాసముంటున్న ఉప్పరి సాయవ్వ (65) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు సాయి గొంతుకోసి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలిసిన స్థానికులు బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించడంతో డీఎస్పీ సత్యనారాయణ పట్టణ సీఐ కృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను పరిశీలిస్తున్నారు. నగల కోసమే హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్‌ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్‌ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్‌ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్‌ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్‌ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్‌ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్‌ఓపీ) ఇచ్చేముందు ఎన్‌ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్‌ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్లు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్‌ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్‌ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్‌ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్‌ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లి‌ష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్‌ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్‌ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచకముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్‌ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ.. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్‌ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్‌ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జూన్ 12: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, కేంద్ర ప్రభుత్వం కూడా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించే సంకల్పంతో పనిచేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం విద్యాసంవత్సరం ప్రారంభమైన సందర్భంగా అర్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలను నగర మేయర్ దండు నీతూకిరణ్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరిపడా నిధులు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికై కృషి చేస్తానన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఉన్నతమైన లక్ష్యసాధన ఉన్నప్పుడే ఉన్నతమైన శిఖరాలను అవరోధించగలమని దేశభవిష్యత్తు నేటి బాలల పైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ లావణ్య, ఎంఈవో రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధిస్తున్నట్లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు రామడుగు గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి పనుల్లో ఆయన పాల్గొన్నారు. ధర్పల్లిలో జరిగిన కార్యక్రమంలో రూ.కోటి 30 లక్షలతో నిర్మించిన అదనపుతరగతి గదులతో పాటు వంట గదిని ఆయన ప్రారంభించారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆయన పేర్కొన్నారు. తాను సైతం ప్రభుత్వ పాఠశాలల్లోనే తెలుగు మీడియం చదివానని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 26 వేల పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసి వాటిలో మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. రామడుగు గ్రామంలో రూ.30లక్షలతో నిర్మించే హనుమాన్ మందిరం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, మాజీసర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, మహేందర్, సుభాష్, వీడీసీ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ధర్పల్లి, జూన్ 12:మండలంలోని రామడుగు గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ స్కూల్ యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు నోట్‌బుక్స్ స్కూల్ డ్రెస్‌లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. గ్రామంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మహేందర్, మహిపాల్ పాల్గొన్నారు.

రుద్రూరు :బడి బాట కార్యక్రమంలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంలోని జెడ్‌పీహెచ్‌ఎస్ (బాలికల), రాణంపల్లి, అక్బర్‌నగర్ గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, జడ్పీటీసీ నారోజి గంగారాం, ఎంపీడీవో సురేష్ బాబు, తహసీల్దార్ వెంకటేశం, ఎంఈవో శాంతకుమారి, ఏపీఎం భాస్కర్, మాజీ సర్పంచ్ తీగుళ్ళ గంగామణి వరప్రసాద్ పాల్గొన్నారు.

మోస్రా:మండలంలోని చింతకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో డ్వాక్రా మహిళా సంఘం ఆధ్వర్యంలో కుట్టుమిషన్ ద్వారా ఏకరూప దుస్తులు కుట్టిన పాఠశాల దుస్తులను ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ముఖీమ్, ఎంపీవో రఫీ, ఎంపీటీసీ రవి, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, విజయ్, పంచాయతీ కార్యదర్శి భూమేష్, డ్వాక్రా సీసీలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:మండలంలోని ధర్మారం(బీ) ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, బర్దిపూర్ సొసైటీ చైర్మన్ రామకృష్ణలు విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి మంచి ప్రతిభ చూపాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజలింగం, ప్రధానోపాధ్యాయులు సంధ్యనాయక్, ఫిజికల్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్:డొంకేశ్వర్, నూత్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో తహసీల్దార్ వెంకటరమణ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీడీసీ క్యాషియర్ గంగారెడ్డి, ఎంపీటీసీ గంగామణి, సంజీవ్, ఉపాధ్యాయులు, పాఠ శాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్:పాఠశాలలు ప్రారంభం కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం యూనిఫాం, నోట్‌బుక్స్‌లను పంపిణీ చేశారు.

బోధన్‌లో కమ్మ సంఘం సంబరాలు

బోదన్‌రూరల్,జూన్12:పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎన్‌టీ రామారావు, చంద్రబాబు నాయుడు అభిమానులు, కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌టీ రామారావు విగ్రహనికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీ రామారావు, చంద్రబాబు నాయుడు అభిమానులు, కమ్మసంఘం సభ్యులు బాణాసంచాలు కాల్చి సంబరాలు నిర్వహించారు. చంద్రబాబు నూతన ప్రభుత్వానికి బోధన్ ప్రాంతవాసుల తరపున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు పల్లెంపాటి శివన్నారాయణ, గాంధీ, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ హన్మంత్ రావు, ఉపాధ్యక్షులు పావులూరి వెంకటేశ్వర్‌రావు, బోదన్ పార్టీ ఇన్‌చార్జి గోపాల్ రెడ్డి, బీజేపీ నాయకులు అడ్లూరి శ్రీనివాస్, ఈవీ రంగారావు, బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి, బాన్సువాడ యువజన కాంగ్రెస్ నాయకులు బానోత్ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాశంకర్, నాగేశ్వర్‌రావు, పులి శ్రీనివాస్, బిల్ల రామ్మోహన్, స్థానిక నాయకులు గాంధీ, డాక్టర్ సునీల్ కుమార్ చౌదరి, వెల్లంకి శ్రీనివాస్ రావు, వేములపల్లి రామ్మూర్తి, రామ్మోహన్ రావు, ముప్పానేని అప్పారావు, బాలస్వామి, సాయిపటేల్, కృష్ణారెడ్డి, పాండు, సచిన్, యుసుఫ్, షకీల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న మొరం టిప్పర్

డిచ్‌పల్లి, జూన్ 12:డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్దిపూర్ బైపాస్ రోడ్డు మీదుగా నిజామాబాద్ వెళ్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సును అతివేగంగా రాంగు రూట్‌లో వచ్చిన మొరం టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో కామారెడ్డి డిపోకి చెందిన బస్సు ముందు భాగం ధ్వంసమైంది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో తృటిలో ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయని కామారెడ్డి ఆర్టీసీ అధికారి తెలిపారు. ఆర్టీసీ బస్సు కండక్టర్ నర్సయ్య 108కు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది స్పృహ తప్పిన డ్రైవర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటన జరగగానే టిప్పర్ డ్రైవర్ పరార్ అయ్యారు. ప్రమాదాలకు కారణమవుతున్న మొరం టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

నేషనల్ హైవే కోసం భూ సేకరణ

● ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్



నసురుల్లాబాద్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో రమేష్

నసురుల్లాబాద్,జూన్ 12: నేషనల్ హైవే హైదరాబాద్ వయా మెదక్ - నర్సపూర్‌టు బాసర వరకు రోడ్డు వెడల్పు పనులు మొదలవుతున్న సందర్భంగా నసురుల్లాబాద్ మండల పరిధిలో బుధవారం బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్ నసురుల్లాబాద్ రెవెన్యూ అధికారులతో కలిసి నసురుల్లాబాద్ మండలం దుర్కి, కాంశెట్టిపల్లి, నసురుల్లాబాద్ గ్రామ రహదారిపై ఉన్న వ్యవసాయ భూముల వద్ద, మూల మలుపులు ఉండటంతో రోడ్డు విస్తరణ సమయంలో 100 ఫీట్ల రోడ్డు పనులు మొదలవుతున్నాయని, ఈ సందర్భంగా రైతులకు అధికారులు సూచించారు. భూ సేకరణలో భాగంగా నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించిన తరువాత రోడ్డు వెడల్పు పనులు మొదలవుతాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయవృత్తి చాలా పవిత్రమైనది

● జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మికాంతారావ్



పిట్లంలో ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్

పిట్లం జూన్ 12: ఉపాధ్యాయవృత్తి అతి పవిత్రమైనదని విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్ అన్నారు.బుధవారం పిట్లంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమానికి ఎమ్మెల్యే తోటలక్ష్మికాంతరావ్ ముఖ్య అతిథిగా హాజరైనారు.ఈసందర్భంగా జ్యోతి ప్రజ్వలను చేసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. తల్లితండ్రులు జన్మనిచ్చి పిల్లలను పెద్దగా చేస్తారని, ఉపాధ్యాయులు పిల్లలను ఉన్నతులుగా చేసి, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విద్యలో మంచి ర్యాంకులు సాధిస్తున్నారన్నారు.ప్రభుత్వ బడులలో మౌలిక వసతుల కొరకు అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా మౌలిక వసతులకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసంచదివి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగినానని గుర్తు చేశారు. ఉపాధ్యా యులు నిబంధతతో పని చేయాలని సూచిం చారు. ఆనంతరంపాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారు.

● రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పిట్లం మండల కేంద్రంలోని నేతాజీనగర్ కాలనీ నుంచి ఆర్యసమాజ్ వరకు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులను జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మికాంతారావ్ ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం నిధులతో పనులు చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్ర మంలో సీనియర్ నాయకులు రాంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు జంబిగే హన్మండ్లు, నాయకులు మోహన్ రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి,అశోక్,చంద్రశేఖర్,బోడ్ల రాజు, శివ,ఇమ్మురోజ్, తదితరులు పాల్గొ న్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



దోమకొండలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

దోమకొండ,జూన్ 12:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు రాధాలక్ష్మీ పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివిప్రయోజకులు కావాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామారెడ్డి: ప్రభుత్వం పంపిణీచేస్తున్న ఉచిత పుస్తకాలను బుధవారం ఎంపీపీ దశరథ్‌రెడ్డి పంపిణీచేశారు.విద్యార్థులకు అర్థమయ్యేరితి లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని సమపాలన పాటించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో యోసప్, వైస్ఎంపీపీ రవీందర్,ఎంపీడీఓ సవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, మురళి, దేవ్లానాయక్‌తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు:మండలంలోని బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమ్మఆదర్శ పాఠశాల కార్యక్ర మంలో బాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ మేరకు ఎంపీడీవో మాట్లాడుతూ ప్ర భుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనేక సౌకర్యాలను కల్పించడంతో పాటుగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఇంగ్లీష్ మీడియంలో బోధించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠ శాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్‌ను, మండలంలోని పెద్దమల్లారెడ్డి, అయ్యవారిపల్లి, కాచాపూర్, లక్ష్మీదేవునిపల్లి, గ్రామాల్లో డంపింగ్ యార్డులు, పారిశుధ్య పనులను పరిశీలించి వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని, గ్రామంలో ఎల్లప్పుడు మురికికాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతిఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా గ్రామపంచాయితీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సదాశివనగర్:ప్రభుత్వ పాఠశాలల్లోనే అందరూ విద్యార్థులు చదువుకునేలా తల్లిదండ్రులు కృషిచేయాలని ఎంపీపీ గైని అనసూయ అన్నా రు. బుదవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం వద్ద ఏకరూప దుస్తులను,పుస్తకాలను పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యను ప్రోత్సహించడానికి ప్రైవేట్ కంటే దీటుగా విద్యాబోధన అందించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు శ్రీకా రం చుట్టడం హర్షించదగిన విషయం అన్నారు.పేద కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు ప్రైవేట్ మోజులో పడి ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయకూడదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో జోసఫ్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ల ఆవిష్కరణ



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డిటౌన్,జూన్12:వరల్డ్ అగైనెస్ట్ చైల్డ్ లేబర్ వాల్ పోస్టర్‌ను సాధన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్పీ సింధూశర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేస్తూ పిల్లల కోసం పాటుపడడం సంతోషంగా ఉందని ఇటువంటి కార్యక్రమాలు కొనసాగించాలని తెలిపారు.అనంతరం ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ రవి మాట్లాడుతూ 0 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లల గురించి చేస్తున్న అవగాహన కార్యక్రమాలను తెలిపారు.

దోమకొండలో అస్సాం టీం బృందం పరిశీలన

దోమకొండ, జూన్ 12: మండలంలోని మహిళా సంఘాల పనితీరును బుధవారం అస్సాం టీం బృందం సభ్యులు పరిశీలించారు. 15 మందితో కూడిన అస్సాం టీం బృందం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలోని సమావేశంలో పాల్గొన్నారు. మహిళా సంఘాలు చేపట్టిన పొదుపు, బ్యాంకు రుణాలు, శ్రీనిధి రుణాల ద్వారా తీసుకున్న ఆదాయాభివృద్ధి లావాదేవీలను పరిశీలించారు. వివిధ అంశాల పనితీరును అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో డీపీఎంలు సురేష్ కుమార్, వకుల, ఏపీఎం రాజు, సీసీలు అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల నాటుసారా పట్టివేత



నాటుసారాను పట్టుకున్న ఎక్సైజ్ దృశ్యం

మాచారెడ్డి,జూన్12:మాచారెడ్డి మండలంలోని పలుగ్రామాలలో నాటు సారా స్థావరాలపై బుధవారం కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు.ఈదాడుల్లో సోమారంపేటకు చెందిన చిట్టవేని నర్సయ్య ఇంట్లో 3లీటర్ల నాటుసారా లభ్యమైందని, అతని విచారించగా సోమరంపేటకు చెందిన మాలోత్ వీణ దగ్గర తీసుకున్నట్లు తెలుపడంతో ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆమెఇంట్లో సైతం 5లీటర్ల నాటుసారా లభ్యం కావడంతో స్వాధీనంచేసుకుని సారా తయారీకి బెల్లం విక్రయించిన గుగులోత్ దేవేందర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలి పారు.ఈ ముగ్గురిపై కేసులు నమోదుచేయడం అయిందని తెలిపారు.అలాగే గతంలో బైండోవర్ అయిన కూడా మళ్లి నాటుసారా తయారుచేసిన నెమలి గుట్ట తండాకుచెందిన మలోత్ సునితపై బైండోవర్ ఉల్లంఘించిన కారణం గా జరిమానా విధించినట్లు తెలిపారు.ఈ దాడుల్లో కామారెడ్డి ఎక్సైజ్ ఎస్ఐ విక్రమ్,సిబ్బంది, ఆంజనేయులు,రమ,శ్రీరాగ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేసిన కేంద్ర బృందం



మాట్లాడుతున్న కేంద్ర బృందం

లింగంపేట, జూన్ 12 : లింగంపేట మండంలోని లింగంపేట, పొల్కం పేట గ్రామాలలోని అంగన్‌వాడి కేంద్రాలను బుధవారం కేంద్ర బృందం సభ్యులుతనిఖీ చేసారు. అంగన్‌వాడి కేంద్రాలలోని పిల్లకు అందుతున్నపౌష్టికాహారం, పిల్లల ఎత్తు, బరువు, వారి సామాజిక పరిస్థితులను గురించి పిల్లల తల్లిదండ్రులను అడిగి తెలు సుకున్నారు. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు తల్లులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరిం చారు. కేంద్రాలలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ బృందం సభ్యులు అల్కి, మధుర్, రేషాదేశాయ్, గీతక్ గోవార్‌లతో పాటు సీడీపీవో సరిత, సూపర్‌వైజర్లు స్వరూ, లతభారతి, అంగన్‌వాడి కార్యకర్తలు ఉన్నారు.

'మిషన్ భగీరథ కుళాయి సర్వేను వేగవంతం చేయాలి'



భగీరథ నీటి సరఫరా వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో

దోమకొండ, జూన్ 12:గ్రామాల్లో ఉన్న మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్ సర్వేను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం దోమకొండ మండల కేంద్రంలో కుళాయి సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇచ్చిన డేటాను 100 శాతం గడువులోగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు కుట్టిస్తున్న ఏకరూప దుస్తులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీయం, ఏపీవో, పంచాయతీ కార్యదర్శి, పాల్గొన్నారు.

● బైరాపూర్‌లో మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

బీర్కూర్: మిషన్ భగీరథపై రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఇంటింటికి సర్వే ప్రారంభించింది. ఇందులో భాగంగా బుధ వారం ఎంపీడీవో భారతి బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేపట్టి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఈ పథకం ప్రారంభ మై ఐదేళ్లు అయినా క్షేత్ర స్థాయిలో సమస్యలు వెంటాడుతున్నాయి. పథకం ద్వారా ఇంటింటికీ తాగు నీరు అంతంత మాత్రంగానే సరఫరా అవుతోందని ప్రజలు ఆవే దన వ్యక్తంచేశారు. కొన్ని గ్రామాల్లో నల్లాలు కూడా అమర్చలేదు. పైప్‌లైన్, లీకేజీల మరమ్మతు ఖర్చులను గ్రామ పంచాయతీలే భరిస్తున్నాయి. తాగు నీటి సరఫరా లేని ఆవాసాలు, ప్రాం తాలు, ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యలను పరిష్కరిం చేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికి సర్వేను ప్రారంభించింది. సర్వేలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా..? నీళ్లు వస్తు న్నాయా..? ఎన్ని రోజులకు ఒకసారి వస్తు న్నాయి. వంద లీటర్లు వస్తున్నాయా? వచ్చే నీళ్లు మిషన్ భగీరథ నీళ్లా? స్థానిక బోరు బావుల నీళ్లా..?తదితర వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.అలాగే యజమాని పేరు, ఆధార్, సెల్ నెంబర్లతో కలిపి యాప్‌లో నమో దు చేస్తున్నారు. యజమాని ఫోటో, ఇంటితో పాటు నల్లా ఫోటోను కూడా తీసి అప్‌లోడ్ చేస్తున్నారు.ఆతరువాత సెల్ నెంబర్‌కు ఓటీపీ వస్తోందని, దానిని ఎంటర్ చేస్తే ధ్రువీకరణ పూర్తవుతుంది.

భిక్కనూరును సందర్శించిన కేరళ బృందం



కేరళ బృందం సభ్యులు

భిక్కనూరు,జూన్12:భిక్కనూరు మండల సమాఖ్యతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల గ్రామ సంఘాలను కేరళ అధికారుల బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్యలో సమాఖ్య ప్రతినిధులు, సిబ్బందితో సమావేశమైన బృందం సభ్యులు సమాఖ్య ఏవిధంగా బలోపేతమైంది, బ్యాంకు లింకేజీ, రుణాలు తీసుకోవడం, చెల్లింపులు, తీసుకున్న రుణాలను ఏవిధంగా సభ్యులు సద్వినియోగం చేసుకుంటున్నారు, రికార్డులు, రిజిస్టర్ల నమోదు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామసంఘాల సభ్యులతో సమావేశమై ప్రతినెల సమావేశం, తీసుకున్న రుణాలతో జీవనోపాధికి ఏవిధంగా ఉపయోగించుకుంటున్నారు, పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేరళ బృందం సభ్యులు మాట్లాడుతూ భిక్కనూరు సమాఖ్య పనితీరు చాలా బాగుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, ఏపీఎం శ్రీనివాస్, డీఎంజీ రాము, సమాఖ్య అధ్యక్షురాలు రాజమణి, సిబ్బంది, కేరళ బృందం సభ్యులు, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట,జూన్ 12: మండల కేంద్రంలో జరుగుతున్న గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణం పనులను బుధవారం స్థానిక ఎంపీపీ వనీ త, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డిలు పరిశీలించారు. 2017లో రూ.4 కోట్ల రూ.40 లక్షల వ్యయంతో మండల కేంద్రంలో గిరిజన గురుకుల పాఠశాల భవనం మంజూరైంది. పాఠశాల భవనం మంజూరీ కాగా భవన నిర్మాణం పనులు ప్రారంభించగా, పాఠశాల భవన నిర్మాణ స్థలం వివాదం కావడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. పనులు పిల్లర్ల వరకు కొనసాగి అర్థాంతరంగా నిలిచి పోయాయి. కాంట్రాక్టర్ పనులు చేయకుండా చేతులు ఎత్తేయడంతో తిరిగి పాఠశాల భవన నిర్మాణం పనులను చేపట్టడానికి ఫిబ్రవరి మాసంలో ప్రభుత్వం టెండర్లను నిర్వహించింది. నిర్మల్‌కు చెందిన ధరణి కన్స్‌స్ట్రక్షన్ టెండర్ తీసుకుని పనులను ఇటీవల చేపట్టింది. పనులు ప్రారంభమైనందున స్థానిక ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డిలు పను లను పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని వారు సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గారెడ్డి, వంశీ కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజలు రాత్రి వేళలో గస్తీ తిరగాలి

ఎల్లారెడ్డి, జూన్ 12: గ్రామాలలో దొంగతనాల నివారణకు గ్రామ ప్రజలు రాత్రివేళలో గస్తీగా తిరిగితే దొంగల భయం ఉండదని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి సర్కిల్ కార్యాలయంలో విలేకరల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లో విలువైన రాగి ఆయిల్ దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించడానికి రాత్రివేళలో గ్రామస్తులు గస్తీగా ఏర్పడి గ్రామ శివారు ప్రాంతాలలో తిరిగితే దొంగలు రావడానికి ఆస్కారం ఉండదని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామాలలో గస్తీలుగా ఏర్పడి తిరగాలని గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రైతులకు ఖరీఫ్ సీజన్ కావడంతో ట్రాన్స్‌పార్మర్ దొంగతనాల వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని పోలీసు శాఖ విద్యుత్ శాఖ సహాయ సహాకారాలు తీసుకుని పెట్రోలింగ్ చేయడం జరుగుతుందని, ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్‌మోడల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్,జూన్ 12:కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక గౌతమ్ మోడల్ స్కూల్‌లో అక్రమంగా పాఠ్యపుస్తకాలు విక్రయించడం, పాఠశాల పేరుకు మరో పేరును జతపరచడంపట్ల నిరసనవ్యక్తం చేస్తూ ఎస్ఎఫ్ఐ,ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పాఠశాలలోని ప్లెక్సీలను చింపి నిరసన వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో బీవీఎం నాయకులుబు ల్లెట్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌ల బదిలీలు

మద్నూర్,జూన్ 12:ఉమ్మడి మద్నూర్ మండలంలో ఉపాధ్యాయుల బదిలీలు ప్రారంభమైంది. ఉమ్మడి మద్నూర్ మండలంలో 36 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ కాగా వారి స్థానంలో 19 మంది ఉమ్మడి మద్నూర్ మండలానికి వచ్చినట్లు విద్యాశాఖ సిబ్బంది వెల్లడించారు. కాగాఉమ్మడి మద్నూర్ మండలంలో ఉపాధ్యాయులు సరిపోయే విధంగా లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు రాలేకపోతున్నట్లు తెలుస్తుంది. మొదటి రోజు విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని డోంగ్లి కాంప్లెక్స్ పరిధిలో ఐదుగురు టీచర్ల బదిలీ కాగా వారి స్థానంలో ముగ్గురు వచ్చారు. మద్నూర్ జడ్పీహెచ్ఎస్ 9 మంది టీచర్లు బదిలీ కాగా ఆరుగురు ఉపాధ్యాయులు వారి స్థానంలో వచ్చారు. జడ్పీహెచ్ ఎస్ ఏక్లార పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు బదిలీ కాగా ఒక్కరు మాత్రమే వచ్చారు. సుల్తాన్‌పేట్‌లో ఇద్దరు బదిలీ కాగా అక్కడికి ఎవరూ రాలేదు. మేనూర్ పాఠశాలలో నలుగురు బది లీ కాగా ఆరుగురు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఉద్యోగ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట, జూన్ 12 : లింగంపేట మైనారిటీ గురుకుల పాఠశాలలో ఉద్యోగ ఖాళీల భర్తికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రాములు తెలిపారు.పీజీటీ సోషల్ స్టడీస్, స్టాఫ్‌నర్స్ ఒక్కొక్క ఉద్యోగానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నా మని ఆయన తెలిపారు. పీజీటీ సోషల్ స్టడీస్‌కు ఏదైనా సోషల్ సబ్జెక్ట్ లో పీజీలో 50శాతం, బీఎడ్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులనిఆయన తెలియజేశారు. స్టాఫ్‌నర్స్ పోస్టుకు బీఎస్సీ నర్సింగ్, లేదా జీఎన్ఎమ్‌లో 50శాతం మార్కు లతో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తులు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఐదు శాతం మినహాయింపు ఉంటుందని ఆయన అన్నారు.ఈనియమకాలు పూర్తిగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో జరుగుతాయని అభ్యర్థులు కామారెడ్డి జిల్లాకు చెంది ఉండాలని, కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని ఆయన తెలియజేశారు. అర్హత ఆసక్తి కలిగిన అభ్య ర్థులు ఈనెల 15 సాయంత్రం 4.30గంటలలోపు పూర్తి వివరాల తో పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలియ జేశారు.

సంఘంలో ఆరోగ్య శిబిరం

నసురుల్లాబాద్, జూన్ 12 : నసురుల్లాబాద్ మండలంలోని సంఘం గ్రామంలో వైద్యులు బుధవారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి పలు వ్యాధులకు చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు. గ్రామంలో మురికి కాల్వలు శుభ్రం చేయడం, వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలని గ్రామ సెక్రటరీ చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరీష్, సీహెచ్‌వో రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో


రాజంపేట,జూన్ 12:మండల కేంద్రంలోని ప్రాథమిక,ఉన్నత బాలికల పాఠశాలలో బుధవారం పాఠశాల యూనిఫాం ఐకేపీ ఆధ్వర్యంలో తయారు చేసిన బట్టలను ఎంపీడీఓ రాజేశం పంపిణీచేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ ద్వారా పాఠశాల విద్యార్థులకు కొలతల ప్రకారం బట్టలు అందించిన వారిని అభినందించారు. గవర్నమెంట్ పాఠశాలలో బట్టలతో పాటు ఉన్నత విద్య దినదినభివృద్ధి పొందుతుందని కొంత మంది మహనుభావాలను గుర్తుకుచేస్తు గవర్నమెంట్ పాఠశాలలో చదివిఉన్నత స్థాయిలో ఉన్నారని విద్యార్థులకు తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజే దుస్తులు అందించడంపై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి,డీపీఎం రమేష్‌బాబు,ఏపీఎం సాయిలు,సీసీలు మహిళలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

లింగంపేట, జూన్ 12: మండలంలోని పొల్కంపేటలో బుధ వారం విద్యుదాఘాతంతో అదే గ్రామానికి చెందిన దామ రాములుకు చెందిన ఆవు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. రోజుమాదిరి బుధవారం మేతకు వెళ్లిన ఆవు గ్రామసమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి అక్కడికి అక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయాన్ని ట్రాన్స్‌కో జెఎల్ఎమ్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తానని తెలిపాడు. మృతి చెందిన ఆవు విలువ రూ.60వేల వరకు ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

తీవ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

కామారెడ్డిటౌన్,జూన్ 12:జమ్మూకాశ్మీర్‌లో వైష్ణోదేవి ఆలయానికి వెళ్తున్న హిందువులపై తీవ్రవాదులు దాడిచేయడాన్ని నిరసిస్తూ బుధవారం విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌర స్తాలో తీవ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా విశ్వహిందూపరిషత్ పట్టణ అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ ఈనెల 9న వైష్ణోదేవి కత్రా నుంచి శివకోడికి వెళ్తున్న బస్సుపై తీవ్రవాదులు దాడి చేసి పదిమంది అమాయకులను పొట్టన పెట్టుకున్నారని అన్నారు.తీవ్రవాదులు విచక్షణ రహితంగా జరిపిన కాల్పుల్లో డ్రైవర్‌తో సహ చిన్న పిల్లలు కూడా మరణించారని ఇది పిరికిపదం చర్య అని అన్నారు. ఈకార్యక్రమంలో నిత్యానందం,శ్రీకాంత్‌రావు,రాజు,అశోక్,శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మేనూర్ మోడల్ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్,జూన్ 12: ఉమ్మడి మద్నూర్ మండలంలోని మేనూర్ తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాల,పాఠశాలలో ప్రవేశానికి నేరుగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. తరగతుల వారీగా ఖాళీగా ఉన్న సీట్ల వివరాలు 6వ తరగతిలో 38, 7వ తరగతిలో 42, 8వ తరగతిలో 16, 9వ తరగతిలో 31, పదవ తరగతిలో 29 కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకై ఎంపీసీ, బైపీసీ, ఎఈసీ, సీఈసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తులు నేరుగా కళాశాలకు తీసుకు వచ్చి ఇవ్వాలని సూచించారు.

ఐదు ఇసుక లారీల పట్టివేత

బిచ్కుంద, జూన్ 12:ప్రభుత్వ అనుమతులు లేకుండా మంగళవారం రాత్రి ఇసుక ను తరలిస్తున్న ఐదు లారీలను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వేబిల్లులు లేకుండా మంజీర పరివాహక ప్రాంతాల నుండి ఇసుక తరలిస్తే ఎంతటి వారినైన ఉపేక్షించే ప్రసక్తేలేదని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా వాహనాల్లో ఇసుకను తరలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వెల్లుట్లపేటలో ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ ఆయిల్ చోరీ



పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి, జూన్ 12 : ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట గ్రామ శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ కాపర్ గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దొంగిలించి ఎత్తుకెళ్లారు. గ్రామ రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక జూనియర్ లైన్‌మెన్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	రక్షణ
శాంతి	ఓసీ
ప్రియా 70	మనమే
ప్రియా 35	సత్యభామ

బాన్సువాడ	
మహేశ్వరి	మనమే
వెంకటేశ్వర	గం గం గణేశా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	151	219	249
వెన్‌కాబ్(కిలో)	:	162	222	260

